నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 22 ఆగస్టు 2024 | KAMAREDDY



కమ్మర్‌పల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

# రోడ్డెక్కిన రైతాంగం

- కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన
- కమ్మర్‌పల్లిలో పలువురి అరెస్టు

**అందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్**


కామారెడ్డి/ మోర్తాడ్, ఆగస్టు 21: రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉమ్మడి జిల్లాలో అన్నదాతలు రోడ్డెక్కారు. రైతులందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీలకతీతంగా బుధవారం రాస్తారోకో నిర్వహించారు. భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేశారు. అంతకుముందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు రైతులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ చేయలేదని విమర్శించారు.రేషన్ కార్డు ప్రామాణికంగా కాకుండా పట్టాదారు పాసుపుస్తకం ఆధారం గా రైతులందరికీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని అధికారులకు వినతి పత్రం అందజేశారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై పార్టీలకు అతీతంగా రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో ప్రకటించి ఇప్పుడేమో రేషన్‌కార్డు లేదు, పేర్లు తప్పున్నాయి అంటూ మాఫీ చేయకుండా ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. మూడు విడుతల రుణమాఫీ జాబితాలు ప్రకటిస్తే అందులో కమ్మర్‌పల్లి మండలంలో కేవలం 30శాతం మందికే మాఫీ వచ్చిందని, మిగతా వాళ్ల పరిస్థితి ఏంటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తహసీల్దార్ ఆంజనేయులు రైతులను సముదాయించే ప్రయత్నం చేయగా.. రైతులు ఆందోళనను విరమించకపోవడంతో పోలీసులు పలువురిని అరెస్ట్ చేశారు.




కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు

## మాఫీ కోసం బీఆర్ఎస్ పోరు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేడు ధర్నాలు
- రైతుకు అండగా నిలువనున్న గులాబీ శ్రేణులు
- అడ్డుకునేందుకు సర్కారు యత్నం.. పోలీసు నోటీసుల జారీ




ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 21: రుణమాఫీ పేరిట రైతులను అరిగోస పెడుతున్న రేవంత్ సర్కారుపై బీఆర్ఎస్ పార్టీ సమరభేరి మోగించింది. అన్నదాతలకు అండగా, ఆంక్షలు లేని రుణమాఫీ అమలు కోసం నేడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమైంది. గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నారు. బాల్కొండ నియోజకవర్గంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నేతృత్వంలో ధర్నాలు నిర్వహించనున్నా రు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఆధ్వర్యంలో, కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నారు. బాన్సువాడలో మాజీ ఎమ్మె ల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నేతృత్వంలో, ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నారు. కార్యక్రమాలకు పార్టీ ముఖ్య నేత లు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఇదిలా ఉండగా రైతులకు మద్దతుగా చేపడుతున్న ధర్నాను అడ్డుకునేందుకు సర్కారు యత్నిస్తున్నది. ధర్నాలో పాల్గొనవద్దని మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులకు పోలీసులు నోటీసులు జారీచేశారు.


**భారీగా తరలిరావాలి: జీవన్‌రెడ్డి**

రైతుల కోసం తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలకు అన్నదాతలతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి రైతులందరికీ రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మోసం చేయడం సరికాదన్నారు.

## 'ధర్నాకు వెళ్లొద్దు'

- గులాబీ నేతలకు పోలీసు నోటీసులు
- బీఆర్ఎస్ ఆందోళనను అడ్డుకునే కుటిల యత్నం

బాల్కొండ, ఆగస్టు 21: రుణమాఫీ పేరిట రైతులను అరిగోస పెడుతున్న రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ గురువారం తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను అడ్డుకునే కుటిల ప్రయత్నాలకు ప్రభుత్వం తెరలేపింది. ప్రతిపక్ష పార్టీ చేపట్టిన ఆందోళనను ఖాకీలతో అడ్డుకునే చర్యలు చేపట్టింది. ధర్నాకు వెళ్లొద్దని పోలీసుల ద్వారా నోటీసులు జారీ చేయిస్తున్నది. ఆందోళన కార్యక్రమాలకు ప్రభుత్వ అనుమతి లేదని, ఒకవేళ ఆ కార్యక్రమానికి వెళ్తే చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమైంది.


నోటీసు
To.
సెల్: 9441316045

పోలీసులు జారీ చేసిన నోటీసు

## ఇందూరులో విషాదం.. చిన్నారి గల్లంతు

వినాయక్‌నగర్, ఆగస్టు 21: మురికికాలువలో పడి చిన్నారి గల్లంతైన ఘటన నిజామాబాద్ నగరంలో బుధవారం కలకలం రేపింది. వర్ని రోడ్ పరిధిలోని అటవీశాఖ కార్యాలయ సమీపంలో నివాసముండే పూజమారుతి దంపతుల కూతురు అను(2) ఇంటి ఎదుట ఆడుకుంటున్నది. ఇంట్లో పని ముగించుకొని బయటికి వచ్చిన తల్లి చిన్నారి కోసం వెతకగా కనిపించలేదు. దీంతో పాప ఇంటి ముందు ఉన్న మురికి కాలువలో పడిపోయినట్లు చుట్టుపక్కల వారికి చెప్పింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని చిన్నారి కోసం మురికి కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.విషయం తెలుసుకున్న కమిషనర్ మకరంద్ ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు పర్యవేక్షించారు.



గల్లంతైన చిన్నారి



బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కమిషనర్

## కొర్రీలతో కోతలు..

- గందరగోళంగా రుణమాఫీ ప్రక్రియ
- బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాలకు పోటెత్తుతున్న అన్నదాతలు
- కుంటి సాకులు చెబుతున్నారని ఆగ్రహం

బీబీపేట్, ఆగస్టు 21: రుణమాఫీపై అన్నదాతలకు వెతలు తప్పడం లేదు. రేషన్ కార్డులో పేరు లేదు.. మొదట వడ్డీ చెల్లించాలి.. రూ.రెండు లక్షల కన్నా ఎక్కువ లోన్ ఉన్నది.. ఆధార్ కార్డు నంబర్ తప్పుగా ఉన్నది.. అంటూ అధికారుల నుంచి రకరకాల కొర్రీలు, కుంటి సాకులు ఎదురవుతున్నాయి. అర్హులమైన తమకూ రుణమాఫీ చేయాలంటూ మొదటి విడుత నుంచి మూడో విడుత ముగిసినా అధికారులు, బ్యాంకుల చుట్టూ రైతుల చక్కర్లు తప్పడం లేదు. తిరిగీతిరిగి చెప్పులరుగుతున్నాయే తప్ప.. రుణమాఫీ జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంతోపాటు మాందాపూర్, జనగామ, యాడారం, మాల్కాపూర్, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్, తుజాల్‌పూర్ తదితర గ్రామాల్లో రూ. రెండు లక్షల వరకు రుణాలు మాఫీ జరగలేని రైతులంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ. 2లక్షల వరకు ఎలాంటి నిబంధనలు లేకుండా మాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



బీబీపేట యూనియన్ బ్యాంకులో బారులు తీరిన రైతులు

### రేషన్‌కార్డులో పేరు లేదంట..



నేను గతంలో రూ. 20 వేలు బ్యాంక్‌లో పంట రుణం తీసుకున్న. మిత్తితో కలిపి మొత్తం రూ. 64 వేలు అయ్యింది. మొదటి విడుత లోనే రుణమాఫీ కావాల్సి ఉన్నది. కానీ రేషన్‌కార్డులో పేరు లేకపోవడంతో మాఫీ కాలేదని ఏఈవో చెప్పిండు. రుణమాఫీ చేస్తామని ఆశ చూపి మోసం చేయడం ఎంత వరకు కరెక్ట్. వెంటనే రుణ మాఫీ చేయాలి.

**- దోనెపల్లి సురేశ్, రైతు, జనగామ**

### అంతా గందరగోళంగా ఉన్నది



ప్రభుత్వం చేసిన రుణమాఫీ అంతా గందరగోళంగా ఉన్నది. నాకు మొత్తం రూ.2లక్షల40వేల వరకు మిత్తితో కలిపి బ్యాంకులో లోన్ ఉన్నది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షలైనా రుణమాఫీ చేయాలి. కానీ రెండు లక్షల కన్నా ఎక్కువగా రుణం ఉన్నదనే కారణంతో రుణమాఫీ కాలేదని చెబుతుండ్రు. పైనుంచి లిస్టులో పేరు వస్తేనే మాఫీ అవుతుందని ఆఫీసర్లు చెప్పిండ్రు.

**పెద్ద బలమాల్లు,**
**- మాల్కాపూర్ రైతు**

### ఇంకెప్పుడు చేస్తారు..



మూడో విడుత జాబితాలో నా పేరు లేదు. ఎందుకు రుణమాఫీ కాలేదని రైతువేదికలో ఏఈవోను అడిగితే మీ కుటుంబంలో మొత్తం రూ.2లక్షల 13వేల వర కు రుణం ఉన్నది. అందుకే మూడో విడుతలో రుణమాఫీ కాలేదని చెప్పిండు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలి.

**- సదాల బలరాములు, రైతు, మాందాపూర్**



## దరఖాస్తు ఫారాలు పారేసిండ్రు..

*రుద్రూర్, ఆగస్టు 21: నాకు మూడున్నర ఎకరాల పొలం ఉన్నది. రూ.లక్షా40వేల లోన్ తీసుకున్న. రుణమాఫీ కాలేదని ఆఫీసర్లను అడిగితే.. ఫారం తీసుకొని దరఖాస్తు చేసుకోండ్రి అన్నరు. రెండో విడుత రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. ఎందుకు మాఫీ కాలేదని అడిగితే బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్, ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం జిరాక్సుతో దరఖాస్తు చేసుకోమన్నరు. సార్లు చెప్పినట్లే చేసిన. మూడో విడుతలో వస్తుందని అనుకుంటే ఇప్పుడు కూడా నా పేరు రాలేదు. మళ్లీ ఆఫీసర్లను అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబుతుండ్రు. దరఖాస్తు చేసుకుందామని రుద్రూర్ రైతువేదికకు వస్తే.. ఇక్కడ మస్తు ఫారాలు పారేసి ఉన్నయ్. మేము కష్టపడి బ్యాంకు చుట్టూ తిరిగి స్టేట్‌మెంట్ తీసుకొని, అన్ని పత్రాలను పెట్టి దరఖాస్తు చేసుకుంటే.. ఇక్కడేమో ఆఫీసర్లు మా ఫారాలను చెత్తలెక్క చూస్తున్నరు.*

*– గణపతి, రైతు, రుద్రూర్*

## బీమా డబ్బులివ్వలేదని.. తల్లిని హతమార్చిన కొడుకు

నస్రుల్లాబాద్, ఆగస్టు 21: తండ్రి మరణించిన అనంతరం వచ్చిన రైతుబీమా డబ్బులను ఇవ్వడం లేదంటూ కన్న కొడుకు తల్లిని హతమార్చిన ఘటన కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం దుర్కిలో చోటు చేసుకున్నది. ఏఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుర్కి గ్రామానికి చెందిన మెక్క అంజవ్వ(46) భర్త సాయిలు ఏడాది కిందట మృతి చెందాడు. దీంతో రైతు బీమా పథకం కింద రూ.ఐదు లక్షలు అంజవ్వ ఖాతాలో జమయ్యాయి. అంజవ్వ కొడుకు సాయికుమార్ ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. తండ్రికి సంబంధించిన బీమా డబ్బులను ఇవ్వాలని తల్లిని వేధిస్తూ వచ్చాడు. మంగళవారం సాయంత్రం సైతం మరోసారి బీమా డబ్బుల విషయం తల్లితో గొడవపడిన సాయికుమార్..కర్రతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అంజవ్వ ఘటనా స్థలంలోనే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం ఘటనా స్థలాన్ని సందర్శించి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

కోల్‌కత్తాలో పీజీ డాక్టర్‌ని హత్యాచారం చేసిన నిందితులని వెంటనే శిక్షించాలని నిజామాబాద్ జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.

-ఖలీల్‌వాడి, ఆగస్టు 21




## ఎత్తిపోతలకు తొలి అడుగు

- చిక్లీ-కంఠం లిఫ్ట్‌కు రూ.132కోట్లు మంజూరు
- త్వరలోనే పనులు ప్రారంభం

మాక్లూర్, ఆగస్టు 21: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రైతుల కల సాకారం కాబోతున్నది. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని చిక్లీ, కొత్తపల్లి, కంఠం, వల్లభాపూర్, గుంజిలి గ్రామాలకు సాగునీరందించే ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభం కానున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి చిక్లీ –కంఠం ఎత్తిపోతలపై అసెంబ్లీలో మాట్లాడారు. రైతుల బాధలను వివరించి, అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావును ఒప్పించి లిఫ్ట్ కోసం రూ.132 కోట్లు మంజూరు చేయించారు. సాంకేతిక కారణాలతో లిఫ్ట్ పనులు ప్రారంభం కాలేదు. తాజాగా రూ.132కోట్లు మంజూరు కావడంతో కాంట్రాక్టర్ లిఫ్ట్ పనులు ప్రారంభించేందుకు నీటిని తరలించే పైపులను పెద్ద సంఖ్యలో ఆయా గ్రామాలకు బుధవారం చేరవేసినట్లు బీఆర్ఎస్ మండల యూత్ ఉపాధ్యక్షుడు దిమెర శ్రీకాంత్, నాగేశ్ తెలిపారు. బినోలా దగ్గర గోదావరి నుంచి చిక్లి పెద్ద చెరువు వరకు లిఫ్ట్ నీరు వచ్చేలా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చొరవ తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు రమేశ్, భోజన్న, రంజిత్, నవీన్, సాయన్న, శేర్‌ఖాన్, శేఖర్, రాజేశ్వర్ ధన్యవాదాలు తెలిపారు



చిక్లీ శివారులో లిఫ్ట్ పనుల వద్ద బీఆర్ఎస్ నాయకులు

## వేతనాలు చెల్లించాలి..

ఇందల్వాయి/బాల్కొండ, ఆగస్టు 21: మిషన్ భగీరథలో పనిచేస్తున్న తమకు ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదంటూ ఇందల్వాయి, బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లోని కార్యాల యాల ఎదుట బుధవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలనీ వేతనాలతో కొన్నేండ్ల నుంచి మిషన్ భగీరథలో పనిచేస్తున్నామని, ఆరు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు పోషించుకోలేని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ యాజమాన్యం స్పందించి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.




బాల్కొండలోని మిషన్ భగీరథ కార్యాలయ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు